మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట



వార్త

## మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి

**నర్సాపూర్, జనవరి 24, ప్రభాతవార్త :** మెదక్ జిల్లాను రాజన్న సిరిసిల్ల జిల్లా జోన్ నుంచి తొలగించి చార్మినార్‌జోన్‌లో చేర్చాలని హోలియో దాసరి హక్కుల పోరాట సమితి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి శాఖమూరి యాదగిరి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లా రాజన్న సిరిసిల్లా జోన్‌లో ఉండటం వల్ల అందరికి ఎన్నో ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. అంతేగాక సిరిసిల్లా ఎక్కువ దూరంలో ఉండటం వల్ల తిప్పలు తప్పడం లేదని తెలిపారు. మెదక్ జిల్లాకు దగ్గరలో ఉన్న చార్మినార్ జోన్‌లో చేర్చాలని కోరారు. అంతేగాక ఎస్సీ 59 కులాల వర్గీకరణలో హోలియో దాసరి కులస్తులను 'ఏ' గ్రూపులో చేర్చాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 57 ఎస్సీ కులాల వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 59 షెడ్యూల్ కులాల వారికి ఉన్న రిజర్వేషన్లను 15 శాతం నుంచి 22 శాతం వరకు పెంచాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం వెంటనే షెడ్యూల్ కులాల అభివృద్ధికి కృషి చేయాలని శాఖమూరి యాదగిరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## అంగన్‌వాడీ టీచర్, ఇన్‌చార్జి సిడిపిఓ సస్పెన్షన్

**సంగారెడ్డి బ్యూరో జనవరి 24 ప్రభాతవార్త :**

నారాయణఖేడ్ ఇన్‌చార్జి సిడిపిఓ సుజాత, మండలంలోని వెంకటాపూర్ అంగన్‌వాడీ టీచర్ అంబికలను సస్పెన్షన్ చేస్తూ శుక్రవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కాంతి వల్లూరు ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో భవనం పైకప్పు పెచ్చులు ఊడిపోయి ఐదుగురు చిన్నారులు గాయాలపాలు కావడంతో అందుకు బాధ్యులుగా అంగన్‌వాడీ టీచర్, ఇన్చార్జి సిడిపివోలను కలెక్టర్ సస్పెన్షన్ చేశారు. జిల్లాలోని ప్రమాదకరంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల సమాచారం అందజేయాలని, జిల్లాలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిని కలెక్టర్ కాంతి వల్లూరు ఆదేశించారు.

ప్రతి నెలకు ఒకసారి భవనాల పరిశీలించాలి , పిల్లల భద్రతకు అవసరమైన అన్ని తక్షణ చర్యల చేపట్టాలని అన్నారు. ప్రమాదకరంగా ఉన్న భవనాల నుండి అంగన్వాడీ కేంద్రాలను వెంటనే ఇతర భవనాలకు మార్చాలని కలెక్టర్ ఆదేశించారు.



'గణతంత్ర' వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మను చౌదరి

## గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో జిల్లా అదనపుకలెక్టర్ అబ్దుల్ హమీద్ తో కలిసి పరిశీలించారు మైదానంలో స్టేజీపక్కన విఐపి, మీడియా ఇతర ప్రజాప్రతినిధులు సిట్టింగ్ అరేంజ్‌మెంట్‌పై తగు సూచనలు చేశారు. జాతీయ జెండా ఆవిష్కరణ, గౌరవవందనం, పరేడ్ పరిశీలన, ప్రొటోకాల్, కల్చరల్ ప్రోగ్రామ్స్ తదితర అంశాలపై అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. పరిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేయాలని మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్‌ను ఆదేశించారు. స్వాతంత్ర సమరయోధులకు సన్మాన ఏర్పాట్లు, వివిధశాఖల వారిగా ప్రభుత్వ పథకాలను తెలియజేసే శకట ప్రదర్శన సంబంధిత ఏర్పాట్లను చూసుకోవాలని అర్బన్ తహశీల్దార్ సలీంను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సదానందం, ఎసిపి మధు, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**-మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 24 ప్రభాతవార్త:**



బైక్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్ రాజ్

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతి వేగాన్ని నియంత్రించాలని, బైక్‌పై హెల్మెట్ లేకుండా ప్రయాణించవద్దని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా బైక్‌ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతి వేగం నియంత్రించాలని, వాహనాదారులు అన్ని పత్రాలను కలిగి ఉండాలని, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయొద్దన్నారు. మెదక్ జిల్లాలో హెల్మెట్ లేనిదే పెట్రోల్ పంపుల్లో ఇక పెట్రోల్ పోయరాని, దీనికి సంబంధించి మార్గదర్శకాలు తయారుచేసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాల అనంతరం త్వరలో జిల్లాలో ప్రవేశపెట్టనున్నట్లు ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా కలెక్టరేట్ నుండి వెల్‌కమ్ బోర్డు వరకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఫోర్ వీలర్ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ సీటు బెల్టు పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్క వాహనానికి ఇన్సూరెన్స్ చేసుకోవాలని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడవరాదని కోరారు. ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబానికి దూరం అవుతారని చెప్పారు. పోలీసులు వాహనాల తనిఖీ చేసినప్పుడు కిలోమీటర్ల మేర వాహనలు ఆపుతున్నారని, వాహనలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. వాహానాలు నడిపే ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించడం వలన రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద చింతకుంటలో గ్రామసభ రసాభాస

**కాంగ్రెస్, టిఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం**

**నర్సాపూర్, జనవరి 24,ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పి ఇప్పుడు కోతలువిధించడం అన్యాయమని ఎమ్మెల్యే సునీతరెడ్డి అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండలం పెద్దచింతకుంటలో గ్రామసభ నిర్వహించారు. గ్రామసభకు ఎమ్మెల్యే సునీతారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాగా గ్రామసభలో కాంగ్రెస్,టిఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగి రసాభాసగా మారింది.దీంతో ఎస్సై లింగం ఆధ్వర్యంలో పోలీసులు రంగ ప్రవేశంచేసి శాంతింపచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో రైతుభరోసా కింద రైతుకు రూ.15 వేలు ఇస్తామనిచెప్పి ప్రస్తుతం రూ.12వేలు ఇవ్వడం ఏమిటని, అదేవిధంగా గుంట భూమి లేని రైతులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో ఉపాధి హామీలో జాబ్‌కార్డు ఉండాలని నిబంధన పెట్టడం. బీమాలోనూ నిబంధన పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అందరికి పథకాలు అందించాలన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో అందరికీ సంక్షేమ పథకాలు అందించామని ఆమె చెప్పగా కాంగ్రెస్‌నాయకులు అడ్డు చెప్పారు. దీంతో సునీతరెడ్డి తన ప్రసంగాన్ని ముగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సంక్షేమ పథకాలు లిస్ట్‌లో తమ పేరు రాలేవంటే తమ పేరు రాలేదని అనుకోవడం కనిపించింది. ఇందిరమ్మ ఇండ్లలో ఇల్లు ఉన్నవారి పేర్లు లిస్ట్‌లో ఉన్నాయని టిఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.కాగా గ్రామసభలో పలువురు వివిధ పథకాలకు దరఖాస్తులు చేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్,మండల వ్యవసాయాధికారి దీపిక, బిఆర్ఎస్‌నాయకులు మన్సూర్, తొంట వినయ్, మాజీ సర్పంచ్ గుండె శివకుమార్, కాటం బిక్షపతి గౌడ్, యాదాగౌడ్ , వెంకటయ్య గౌడ్, గుండె యాదయ్య, మొగులయ్య, ఇరు పార్టీల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 24 ప్రభాతవార్త:** ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఘనంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ వివిధ శాఖల ద్వారా శకంటాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు, అధికారులకు ప్రశంసా పత్రాలు అందించడానికి ఈ రోజు వరకు జాబితా ఇవ్వాలని సూచించారు. వేడుకలకు సంబంధించి ప్రొటోకాల్ పాటిస్తూ అతిథులు కూర్చోవడానికి అనువుగా షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. స్టేజ్ ఏర్పాట్లు, త్రాగునీటి సరఫరా,పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో పకడ్బందీగా నిర్వహించాలని, జిల్లా ప్రగతి సందేశాన్ని తయారు చేయాలని, స్టాళ్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులతో దేశభక్తి గీతాలపై నృత్య ప్రదర్శనలు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని డీపీఆర్‌వోను, డీఈవోను కలెక్టర్ ఆదేశించారు. వేడుకల సందర్భంగా అంబులెన్సులు, అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉంచాలని అన్నారు. గ్రౌండ్‌లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ఇతర శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టరేట్‌లో లెస్ పేపర్, లెస్ ప్లాస్టిక్, లెస్ ఎలక్ట్రిక్ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం**

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 24 ప్రభాతవార్త:** కలెక్టరేట్‌లో లెస్ పేపర్, లెస్ ప్లాస్టిక్, లెస్ ఎలక్ట్రిక్ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో ఈ ఆఫీస్ అమలు చేయాలని, పేపర్‌పై పని తగ్గించాలి, ప్లాస్టిక్ రహిత కార్యాలయాలుగా తయారు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్‌ను ఆదా చేయాలని, ఈ ఆఫీస్‌ను అమలు చేసి పేపర్‌పై పని తగ్గించాలని, కలెక్టర్ కార్యాలయంలో పూర్తిగా ప్లాస్టిక్ నియంత్రించాలని, ప్లాస్టిక్ రహిత కార్యాలయంగా తీర్చి దిద్దాలన్నారు. విద్యుత్‌ను ఆదా చేయాలని, అనవసరంగా విద్యుత్‌ను ఉపయోగించకుండా ఉండాలన్నారు.



మాట్లాడుతున్న ఐజి సత్యనారాయణ

## హింసాత్మక ఘటనలను ఉపేక్షించేది లేదు

**హైదరాబాద్ మల్టిజోన్ 2 ఐజీ సత్యనారాయణ**

**క్యాంప్ కార్యాలయంపై దాడిలో 43 మందిపై కేసు నమోదు**

**పటాన్ చెరు, జనవరి 24 ప్రభాతవార్త:** అప్రజాస్వామిక పద్దతిలో జరిగే ఏలాంటి హింసాత్మక సంఘటనలను ఉపేక్షించేదిలేదని, అలాంటి ఘటనలకు పాల్పడినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ మల్టి జోన్ 2 ఐజీ సత్యనారాయణ స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలో మూడు రోజులుగా జరుగుతున్న రాజకీయ పరిణామాలు, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడి నేపథ్యంలో ఐజీ సత్యనారాయణ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. శుక్రవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఐజీ గురువారం జరిగిన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన దాడికి సంబంధించిన వివరాలను సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్, పటాన్ చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన 43 మందిని గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఐజీ సత్యనారాయణ మాట్లాడుతూ... హైదరాబాద్ మల్టీ జోన్ 2లో గద్వాల్, పటాన్‌చెరుమినహా ప్రజాపాలన గ్రామసభలు ప్రశాంతంగా జరిగాయన్నారు. పటాన్ చెరు నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య జరిగిన సంఘటనలు తమ దృష్టికి వచ్చాయని, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన సంఘటనకు సంబంధించి అంబేద్కర్ విగ్రహం వద్ద వరకు జరిగిన అన్ని పరిణామాలు తమ నియంత్రణలో ఉన్నాయని తెలిపారు. క్యాంప్ కార్యాలయం వద్ద ఘటన జరగటం వెనుక ఉన్న శక్తులను గుర్తిస్తామని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్, పటాన్ చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, పటాన్ చెరు సీఐ వినాయక రెడ్డి, క్రైమ్ సీఐ రాజు, తదితరులు పాల్గొన్నారు

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

**జహీరాబాద్ ఎంపి సురేష్‌షెట్కార్**



మాట్లాడుతున్న ఎంపి సురేష్‌షెట్కార్

**కంగ్టి, జనవరి 24 ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తుందని జహీరాబాద్ ఎంపి సురేష్‌షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కంగ్టిలో ఏర్పాటు చేసిన గ్రామసభకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రైతుభరోసా కింద ప్రతి ఒక్కరికి అర్హులైన వారికి అందజేస్తామన్నారు. కంగ్టి మండలానికి రూ.22 కోట్లు ఇస్తున్నామని,రుణ మాఫీ కంగ్టి మండలంలో 52,60,13474 రుణ మాఫీ జరిగిందన్నారు. ఇందిరమ్మ భరోసా కింద మండలంలో 911 మందికి రైతు భరోసాఇస్తున్నమని మండలంలో ఇందిరమ్మ ఇళ్ల కింద దరఖాస్తులు చేసుకున్న 4345 మంది అర్హత కలిగి ఉన్నారని అన్నారు. గత పది సంవత్సరాల నుంచి ఒక రేషన్‌కార్డు ఇవ్వలేదని రైతులకు బిఆర్ఎస్ ప్రభుత్వం ఓట్లు దండుకున్నారే తప్ప రైతులకు ఏమి చేయలేదని వారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంచెలంచెలుగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో బీద బదుగు వర్గాల వారికి కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలు పెట్టి ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నజీబ్‌ఖాన్, ఎంపిడీఓ సత్తయ్య, ఏడీఏ నూతన్‌కుమార్, ఏఓ హరిష్‌నాయక్, ఏపీఓ నర్సింలు, ఏఈఓ స్వాతి, పీఏసీఎస్ ఛైర్మన్ డి.మారుతిరెడ్డి, సిద్దేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ దారం వెంకన్న, ఎంపీటీలు సుభాష్, సంజీవన్‌రావు, దిశ కమిటీ మెంబర్ ప్రకాష్ రాథోడ్, మాజీ జడ్పీటీసీ రాథోడ్ సర్దార్, మాజీ ఎంపీపీలు మాధవరావుపాటిల్, నాయక్‌సాబ్, దామ నాగన్న, తాజా మాజీ సర్పంచ్‌లు, కంగ్టి గ్రామ అధ్యక్షులు చందర్‌రెడ్డి, నాగనాథ్ మాస్టర్, శ్రీనివాస్‌రెడ్డి, కంగ్టి గ్రామ లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధరం గురువారెడ్డి

## తెలంగాణ గోల్డ్ కప్ క్రికెట్ టోర్నీని విజయవంతం చేయాలి

**-క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి**

గజ్వేల్, జనవరి 24 (ప్రభాతవార్త): తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26 నుండి గజ్వేల్ పట్టణంలోని ఐటిసి గ్రౌండ్‌లో జిల్లా స్థాయి తెలంగాణ గోల్డ్ కప్-2025 క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో మొత్తం 20 జట్లు నాలుగు గ్రూపులుగా ఏర్పడి లీగ్ కమ్ నాకౌట్ పద్దతిలో నిర్వహిసున్నట్లు తెలిపారు. ఇదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలలో తెలంగాణ గోల్డ్ కప్ క్రికెట్ టోర్నీ నిర్వహించడం జరుగుతుందన్నారు. విజేతలకు రూ.50వేల నగదు బహుమతి, రన్నరప్ జట్టుకు రూ.25వేల నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి హరిప్రసాద్, బిజెపి సీనియర్ నాయకులు కుడిక్యాల రాములు, నత్తి శివకుమార్, గజ్వేల్ పట్టణ బిజెపి అధ్యక్షుడు మనోహర్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు అశోక్‌గౌడ్, సంపత్‌రెడ్డి, బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యుడు వెంకట్‌రెడ్డి, నాయకులు నాయిని సందీప్, నరసింహ్, నాగేందర్, భాస్కర్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**నర్సాపూర్, జనవరి 24, ప్రభాతవార్త :** పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీలో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి నుండి 8వ తరగతి వరకు ఇంటర్మీడియట్ ప్రథమ ద్వితీయ సంవత్సరాలకు(అడ్మిషన్స్) ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ నసీమాషైక్ తెలి పారు.విద్యార్థులకు ఉత్తమమైన విద్యాబోధన అందిస్తున్నామన్నారు. గత సంవత్సరంలో పదవ తరగతి తో 100 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ సంస్థ అద్భుతమైన విద్యా ప్రమాణాలను పెంచుతున్నట్లు తెలిపారు. మైనార్టీ రెసిడెన్స్ కళాశాలలో చదివిన విద్యార్థులు గత సంవత్సరం ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలు సాధించారన్నారు. అంతేగాక విద్యార్థి అమీరుద్దీన్ రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించి మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీట్లు సాధించాడని ఆమె చెప్పారు.ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మైనార్టీ స్కూల్‌లో అడ్మిషన్లు పొంది భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రిన్సిపల్ నసీమా షైక్ తెలిపారు. ఈ మైనారిటీ స్కూల్లో అడ్మిషన్లు పొందాలనుకురే విద్యార్థులు ఈ ఫోన్ నెంబర్ 7331170825 సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని ఆమె సూచించారు

## పాఠశాలలోనే కాకుండా ఇంటి వద్ద చదువుకునే ఒక కొత్త కార్యక్రమానికి హరీష్‌రావు శ్రీకారం

**త్వరలో టెన్త్ విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపిణీ**

**సిద్దిపేట రూరల్, జనవరి 24, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేట అన్ని రంగాలలో ఆదర్శంగా నిలుస్తూ వచ్చింది. అదే స్ఫూర్తితో విద్యారంగంలో, అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచింది. సిద్దిపేట నియోజకవర్గం అగ్రస్థానంలో నిలిచేలా పదో తరగతి విద్యార్థులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. నియోజకవర్గంలోని 2500 మంది పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ కంటెంట్స్ బుక్స్ స్వయంగా పంపిణీ చేయనున్నారు. గత ఏడాది నుంచి డిజిటల్ కంటెంట్ రూపంలో జిల్లాలోని పదో తరగతి విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు. అదే స్ఫూర్తితో ఈ ఏడు సిద్దిపేట నియోజకవర్గంలోని పదోతరగతి విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేయనున్నారు. జిల్లా పదో తరగతి ఫలితాల్లో గత 5 ఏళ్ల నుంచి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుస్తూ వచ్చింది. అదే స్ఫూర్తితో ఈ సంవత్సరం సిద్దిపేట నియోజకవర్గం అగ్రస్థానంలో నిలిచేలా గత నెల నుంచి హరీష్‌రావు విద్యాశాఖ అధికారులతోపాటు ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులకు నేరుగా ఉత్తరం రాయడంతో పాటు వారిని ఇంటి వద్ద చదివించేలా తల్లి దండ్రుల్లో, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపేలా కాన్ఫరెన్స్ నిర్వహించారు. పదో తరగతి భవితకు ఎంతో పునాది అని ఆ దిశగా పై చదవులకు పదో తరగతి స్ఫూర్తి కావాలని పాఠశాలలోనే కాకుండా ఇంటి వద్ద చదువు కొనే ఒక కొత్త కార్యక్రమానికి హరీష్‌రావు శ్రీకారం చుట్టి విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం నింపుతూ ఆత్మవిశ్వాసం కల్పించారు. త్వరలోనే టిహెచ్ఆర్ అడ్వాన్స్‌గా పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపిణీ చేయనున్నారు.



మ్యాన్‌హోల్ నుంచి బయటకు తీస్తున్న దృశ్యం

## మృత్యుంజయుడు మల్లేశం

**వారం రోజులుగా మ్యాన్‌హోల్‌లో వున్న మల్లేశం**

**నర్సాపూర్, జనవరి 24, ప్రభాతవార్త :** వారంరోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి మ్యాన్‌హోల్‌లో ప్రత్యక్షమై మృత్యుంజయుడుగా బతికి బయటకువచ్చిన ఉదంతం నర్సాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ సంఘటన వివరాల్లోకి వెళితే...నర్సాపూర్‌లోని హైదరాబాద్ రోడ్డులోగల హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఎదురుగా ఒక పెద్ద మురికి కాలువలో మ్యాన్ హోల్ ఉంది. మ్యాన్ హోల్ లోపల నుండి ఒక వ్యక్తి చేతివేళ్లు బయటపెట్టాడు. అది గమనించిన బ్యాంకు సిబ్బంది, జనం మ్యాన్ హోల్‌లోకి చూడగా ఒక వ్యక్తి ఉన్నట్లు గమనించి వెంటనే బయటకు తీశారు. ఈనెల 18న నర్సాపూర్ బస్టాండ్‌లో అదృశ్యమై కనపడకుండాపోయిన వ్యక్తి అని, మెదక్ మండలం అవుసులపల్లి గ్రామానికి చెందిన నాగారం మల్లేశం(56)గా గుర్తించారు. వారం రోజులపాటు మల్లేశం ఫొటోతో కనబడుటలేదు అని వాట్సాప్ గ్రూపులో పెద్దఎత్తున ప్రచారం చేయడం జరిగింది. దీంతో ఆ వ్యక్తిని తొందరగా అందరు గుర్తించడం జరిగింది. వారం రోజులపాటు మ్యాన్ హోల్‌లో ఉంటూ తిండి నీరు లేకుండా బతికిబయటపడిన మల్లేష్‌ను మృత్యుంజయుడుగా అందరూ అభివర్ణించారు. మాన్‌హోల్ నుంచి మల్లేష్‌ను బయటకు తీసినవారిలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ మున్సిపల్ చైర్మన్ మురళియాదవ్, దేవేందర్‌యాదవ్, కడారి నాగరాజు, నవీన్ యాదవ్, రానా, నిరంజన్ పాల్గొన్నారు.

## బాలికల విద్యతోనే సమాజాభివృద్ధి

**మెదక్ జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి హైమావతి**




జాతీయ బాలిక దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న డీడబ్ల్యూవో హైమావతి

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 24 ప్రభాతవార్త:** బాలికా విద్యతో సమాజ అభివృద్ధి సాధ్యపడుతుందని డీడబ్ల్యూవో హైమావతి అన్నారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో మహిళా శిశు సంక్షేమ, మిషన్ శక్తి శాఖల సమన్వయంతో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జాతీయ బాలిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి హైమావతి మాట్లాడుతూ బేటి బచావో.. బేటి పడావో పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆడపిల్లలు భారం కాదు.. భవితకు సోపానం అన్నారు. బాలబాలికలను తల్లిదండ్రులు సమానత్వంతో చూడాలని, జాతీయ బాలికల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. బాలికలు నిత్యం ఎదుర్కొనే సమస్యలను అధిగమించి జీవితంలో అభివృద్ధిదిశగా ముందుకు వెళ్లటమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. భ్రూణ హత్యల నిర్మూలనకు పుట్టిన ఆడబిడ్డకు రక్షణ కల్పించేందుకు పీసీపీఎన్డీటీ యాక్ట్ ఉందని, ఎవరైనా సరే లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠినచర్యలు తప్పవని స్పష్టంచేశారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందిస్తూ బాలికల ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, ఆడపిల్లలకు మెరుగైన విద్యను అందించటం కోసం కేజీబీవీలు ఉన్నాయని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మహిళా ఉపాధ్యాయులు కనిపెట్టుకొని ఉంటున్నారని, అదేవిధంగా బాలికల రక్షణార్థం బాలకార్మిక చట్టం, పోక్సో యాక్ట్, బాల్య వివాహాల నిషేధ చట్టం, వరకట్న నిషేధ చట్టం, గృహ హింస చట్టం ఉందని, ఒకవేళ ఎవరైనా ఈ చట్టాలను అతిక్రమిస్తే జామీను లేకుండా క్రిమినల్ కేసులు నమోదవుతాయని, పని ప్రదేశంలో మహిళలు లైగింక వేధింపులకు గురికాకుండా మహిళా సంరక్షణ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా పనిచేసే చోట మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ జగదీశ్వర్, సీడీపీవో హేమభార్గవి, ఏసీడీపీవో వెంకటరమణ, జీసీడీవో జగదీశ్వరి, సీడబ్ల్యూసీ సభ్యులు సఖి కోర్డినేటర్, భరోసా కోఆర్డినేటర్, ప్లాన్ ఇండియా టీమ్, మహిళా సాధికారత టీమ్ కోఆర్డినేటర్ సంతోషి, జండర్ స్పెషలిస్ట్ నాగమణి, కవిత, రమేష్ సంతోష్, లక్ష్మణ్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

## భవనం పెచ్చులూడి ఆరుగురు విద్యార్థులకు గాయాలు

**నారాయణఖేడ్, జనవరి 24 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ భవనంలో పెచ్చులూడి ఆరుగురు విద్యార్థులకు గాయాలయ్యాయని గ్రామస్థులు, అంగన్‌వాడీ టీచర్ అంభిక తెలిపారు. వెంకటాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో 27 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో పాఠశాలకు 15 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో ఆకస్మాత్తుగా భవనం పెచ్చులూడి మౌనిక, హరిక,ఎం.అంకిత, అభినవ్, రిశిక, ఎం.ప్రణయ్‌కుమాలకు గాయలయ్యాయి. విషయం తెలుసకున్న గ్రామస్థులు విద్యార్థులకు ప్రభుత్వఏరియా ఆసుపత్రికి విద్యార్థులకు తరలించి వైద్య చికిత్సలు చేయిస్తున్నారు.

## అవసరమైతే రాజీనామాకు సిద్ధం

-సహకార సంఘం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

**చిన్నశంకరంపేట,జనవరి 24,ప్రభాతవార్త:**

మదూర్ సహకారసంఘం విషయంలో తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని, ఆ ఆరోపణలు నిజమని తేలితే రాజీనామాకు సిద్ధమని మదూర్ సహకారసంఘం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనపై కావాలనే కొందరు దుష్ప్రచారాలు చేస్తున్నారని, దీనిపై ఎలాంటి విచారణకైనా సిద్ధమన్నారు. సహకారసంఘం అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తున్నానని, రైతులకు కూడ అన్ని విధాలుగా సహకరించానని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలకు తావివ్వకుండా కష్టపడి పనిచేశానని తెలిపారు. సహకారసంఘంలో ఉన్నతాధికారులు విచారించి తప్పుచేసినట్లు నిరూపణ అయితే ఎలాంటి శిక్షకైనా అవసరమైతే రాజీనామాకు కూడా సిద్ధమని ఆయన తెలిపారు. గురువారం మండలపరిధి ఖాజాపూర్‌గ్రామానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు వచ్చిన సందర్భంగా కొందరు రైతులు చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిపై ఫిర్యాదు చేయగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌కు ఫోన్ చేసిన మైనంపల్లి హనుమంతరావు విచారణ జరిపి శ్రీనివాస్‌రెడ్డి తప్పు చేసినట్లు నిరూపణ అయితే చర్యలు తీసుకోవాలని సూచించిన విషయం తెలిసిందే.

## వంటల్లో నాణ్యత, శుభ్రత పాటించాలి

-మండల విద్యాధికారిణి పుష్పవేణి

**చిన్నశంకరంపేట, జనవరి 24, ప్రభాతవార్త:**

పాఠశాల్లో చదివే విద్యార్థులకు రుచికరమైన నాణ్యతతో కూడిన భోజనం అందించాలని మండల విద్యాధికారిణి పుష్పవేణి అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండలవ్యాప్తంగా ఉన్న 43 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు వంటపాత్రలను అందించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యతతో మెనూప్రకారం భోజనం అందించాలని, వంటల్లో నాణ్యత, శుభ్రత పాటించాలన్నారు. తాజా కూరగాయలు, ఆకు కూరలతో భోజనం అందించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో మదూర్, ధర్పల్లి, మిర్జాపల్లి పాఠశాలల్లో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంగా ఉండాలంటే యోగా అవసరం




ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగాచేస్తున్న విద్యార్థులు

**చిన్నశంకరంపేట, జనవరి 24, ప్రభాతవార్త:**

ఆరోగ్యంగా ఉండాలంటే యోగా తప్పనిసరిగా చేయాలని చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శశిధర్ అన్నారు. శుక్రవారం కళాశాలలో టెలిమానస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థలచేత యోగా, ధ్యానం చేయించారు. యోగచేయడం ద్వారా మానసికంగా దృఢంగా ఉండి పరీక్షలో ఉత్తమఫలితాలను సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో యోగా శిక్షకుడు సుబుద్ధి, ప్రణిత, వేణుమాధవ్ తదితరులున్నారు.

## రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోండి

-మండల వ్యవసాయాధికారిణి లక్ష్మీప్రవీణ్

**చిన్నశంకరంపేట, జనవరి 24, ప్రభాతవార్త:**

రైతుభరోసాకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి లక్ష్మీప్రవీణ్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అందించే రైతు భరోసా పథకంకోసం రైతులు శనివారం దరఖాస్తులను మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. వ్యవసాయ భూములు 2024 డిసెంబర్ 30లోపు రిజిస్ట్రేషన్ అయిన రైతులు తమ ధరఖాస్తు ఫారం, ఆధార్‌కార్డు, పట్టా పాస్‌పుస్తకం, బ్యాంకు జిరాక్స్‌లను వ్యవసాయ కార్యాలయంలో, గవ్వలపల్లి రైతువేదిక భవనంలోని అధికారులకు సమర్పించాలని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

-ప్రముఖ సినీనటి గీతాభాస్కర్

**పటాన్‌చెరు, జనవరి 24, ప్రభాతవార్త:**

విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ప్రముఖ సినీనటులు డైరెక్టర్ తరుణ్ భాస్కర్ అమ్మ, ప్రముఖ సినీనటి గీతాభాస్కర్ అన్నారు. సంగారెడ్డిజిల్లా పటాన్‌చెరుమండలం చిన్నకంజర్ల గ్రామపరిధిలోని విజ్ఞాన్ విద్యాలయంలో గురువారం సాయంత్రం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీనటి గీతాభాస్కర్, విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రావణ్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా గీతాభాస్కర్ మాట్లాడుతూ.. విద్యార్థులు తల్లిదండ్రులకు ప్రేమ ఆప్యాయతలు పంచాలని అన్నారు. చరవాణికి దూరంగా ఉండాలని, అలాగే బయటి ఆహార పదార్థాలను తినకుండా ఇంట్లోనే తయారుచేసిన భోజనాలను తినాలని తెలిపారు. విద్యార్థుల డాన్సులు, సంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఎంతగానో అలరించాయి. పలువురు విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో ఆంగ్లవిషయ కోఆర్డినేటర్ నిజాంపేట వైస్ ప్రిన్సిపాల్ పద్మ, సాంఘికశాస్త్ర కోఆర్డినేటర్ మైకేల్, విజ్ఞాన్‌స్కూల్ ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

**కొల్చారం, జనవరి 24, ప్రభాతవార్త:**

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మరెల్లి అనిల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పైతర గ్రామంలో ప్రజా పాలన గ్రామసభను అధికారులు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మరెల్లి అనిల్ మాట్లాడుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల మంజూరు కోసం తెలంగాణ ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తూ పేద ప్రజలకు లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో ముందుకెళ్తుందని వారు తెలిపారు.

కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శ్వేత కుమారి, ఏఈవో రోజ, పంచాయతీ కార్యదర్శి మహేష్, కానిస్టేబుల్ మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కుమ్మరి భూమయ్య, యాదవ రెడ్డి, కుమ్మరి శివకుమార్, కార్తీక్‌రాజ్, మాడబోయిన శేఖర్, బోయిని అంతయ్య, పుట్టి శివ, కుమ్మరి ప్రవీణ్, దూదేకుల ఇబ్రహీం, షాదుల్లా, మరెల్లి ప్రభాకర్, సొంగ గణేష్, చిప్ప రాజు పాల్గొన్నారు.

## వనదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

**పాపన్నపేట, జనవరి 24, ప్రభాతవార్త:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గాభవానీమాతను శుక్రవారం నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేను ఆలయసిబ్బంది ఆలయమర్యాదలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా ఎమ్మెల్యే ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలుచేసి తీర్థప్రసాదాలు అందచేయగా ఆలయసిబ్బంది శాలువాతో సత్కరించారు.

# అమీన్‌పూర్‌లో విలీన గ్రామాల అభివృద్ధికి కృషి

-పటాన్‌చెరు శాసన సభ్యులు మహిపాల్‌రెడ్డి

-2 కోట్లు 38 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

-నూతన రిజర్వాయర్ నుండి మంచినీటి సరఫరా ప్రారంభం

**అమీన్‌పూర్, జనవరి 24, ప్రభాతవార్త:**

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో విలీనమైన గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, సుల్తాన్‌పూర్, ఐలాపూర్, ఐలాపూర్‌తాండ, దయారాపరిధిలో 2కోట్ల 38లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం పటేల్‌గూడపరిధిలో నిర్మించిన నూతన రిజర్వాయర్ నుండి మంచినీటి సరఫరాను ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశాల్లో శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరిని అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. విలీన గ్రామాల పరిధిలో ఏర్పాటు అవుతున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్‌చైర్మన్ నరసింహాగౌడ్, మాజీ ఎంపిపి దేవానందం, మాజీ జడ్పీటిసి సుధాకర్‌రెడ్డి, జలమండలి జిఎం సుబ్బారాయుడు, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, మాజీ వైస్ ఎంపిపి దండే సునీత సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు నితీశా శ్రీకాంత్, కృష్ణ, రాజు, భాస్కర్ గౌడ్, మల్లేష్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న శాసనసభ్యులు మహిపాల్‌రెడ్డి

## విజయవంతమైన రక్తదాన శిబిరం

**రామాయంపేట, జనవరి 24, ప్రభాతవార్త:**

శుక్రవారం మెదక్‌పట్టణంలో నిర్వహించిన రక్తదానశిబిరం విజయవంతమైంది. ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ ఆధ్వర్యంలో మెదక్‌పట్టణంలోని హెల్ప్ ఆసుపత్రిలో నిర్వహించిన శిబిరంలో జిల్లాలోని మెడికల్‌షాప్ యజమానులు పాల్గొని రక్తదానంచేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, జిల్లా ప్రభుత్వ రక్తనిధికేంద్రం వారు కూడా పాల్గొన్నారు. రక్తదానం మహాదానమని, ప్రతి ఒక్క ఆరోగ్యవంతులు మూడునెలలకు ఒకసారి రక్తదానంచేసి ఆపదలో ఉన్నవారికి సహాయంచేయాలని పలువురు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో తెలంగాణరాష్ట్ర కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కోశాధికారి, జిల్లా అధ్యక్షుడు తోడుపునూరి రాజు, రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్ దేమే యాదగిరి, తెలంగాణరాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షులు, జిల్లా ప్రధానకార్యదర్శి వట్టం సంగమేశ్వర్, మెదక్ మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ వి.సులోచన ప్రభురెడ్డి, రాగం శ్రీనివాస్, కృష్ణగౌడ్, నయీమ్, వీరమల్లి రమేష్, నేహా వెంకటేశం, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మెన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తోగరి సుభాష్ చంద్రబోస్, కోశాధికారి డి.జి. శ్రీనివాస శర్మ, కార్యవర్గ సభ్యులు మద్దెల సత్యనారాయణతో పాటు రక్తనిధికేంద్రం అశోక్, జలాలుద్దీన్, జిల్లాలోని వివిధమండలాల నుంచి వచ్చిన దాతలు ఈశిబిరంలో పాల్గొన్నారు.

## రైతుభరోసా దరఖాస్తుల స్వీకరణ



రైతుభరోసా దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం

**రామాయంపేట మున్సిపాలిటీ, జనవరి 24, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినటువంటి రైతుభరోసా కార్యక్రమం ద్వారా రైతులకు ఎకరాకు 6వేల చొప్పున రైతులకు నేరుగా బ్యాంకు ఖాతాలో జమచేయడం జరుగుతుందని, ఈకార్యక్రమం ఈనెల 26వ తారీఖున ప్రారంభం జరుగుతుందని ఇంచార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్‌నారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయం ఆవరణలో దరఖాస్తులను స్వీకరించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ జనవరి 1, 2025 తేదీలోపు కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన రైతులందరూ వెంటనే రైతుభరోసా కోసం దరఖాస్తు చేసుకోవాల న్నారు. రామాయంపేట మండలవ్యాప్తంగా 767మంది రైతులకు కొత్తగా పట్టా పాస్‌పుస్తకాలు జారీచేయడం జరిగిందని, వీరందరూ వెంటనే తమ వ్యవసాయ పట్టా పాసుపుస్తకం జిరాక్స్, బ్యాంకుఖాతా, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను వ్యవసాయ కార్యాలయంలో గాని సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు గాని వెంటనే అందజేయాలని సూచించారు. బ్యాంకు ఖాతాలకు సంబంధించి క్రాప్ లోన్ అకౌంట్ ఉన్నా లేదా యాక్టివేట్‌లో లేని అకౌంట్ ఉన్నా అకౌంట్ మార్పుకోసం కొత్తగా బ్యాంకుఖాతా వాటి వివరా లను వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఇంతకు ముందే పట్టా పాస్‌పుస్తకాలు పొంది, రైతుభరోసా పొందుతున్నటువంటి రైతులు కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమం లో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శ్రీనివాస్, సాయికృష్ణ, ప్రవీణ్, సందీప్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

## చిన్నారులకు దుస్తుల పంపిణీ

**వెల్దుర్తి, జనవరి 24 ప్రభాతవార్త:**

మండల పరిధిలోని మంగళపర్తి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు శుక్రవారం దుస్తులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కె.సుమలత, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన గ్రామసభలో గందరగోళం



గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

**కొల్చారం, జనవరి 24, ప్రభాతవార్త:**

మండలకేంద్రమైన కొల్చారంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో గందరగోళం నెలకొంది. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రత్యేకాధికారి, తహశీల్దార్ గఫార్‌మియా ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించగా అంతా గందరగోళం నెలకొంది. ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకంలో అన్నిపేర్లు కాంగ్రెస్‌పార్టీకిచెందిన నాయకులవే కావడం విస్మయానికి గురిచేసింది. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న కొంతమంది పేర్లు మాత్రమే రావడంతో బిఆర్ఎస్, బిజెపి పార్టీల నాయకులు ప్రజాపాలన గ్రామసభలో అధికారులను నిలదీశారు. ఈసందర్భంగా తాహశీల్దార్ గఫార్‌మియా మాట్లాడుతూ ఇప్పటికీ మించిపోయింది లేదని, అన్ని విషయాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అన్నారు. అర్హులైన అందరూ దరఖాస్తు చేసుకోవచ్చని, ఇంకా సమయం ఉందని, దీనిగురించి దిగులు చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఈకార్యక్రమంలో రాజాగౌడ్, మాజీ ఉపసర్పంచ్ చెన్నయ్య, కాంగ్రెస్‌పార్టీ నాయకులు శేఖర్, మండలపార్టీ మైనార్టీసెల్ అధ్యక్షులు అక్రమ్,గంగసాని మహేశ్వర్‌రెడ్డి,చౌరిగారి చిన్నరాములు,యాదగిరి, తమ్మలి సంతోష్‌కుమార్, కృష్ణ, నారాయణ, అనిల్‌కుమార్, సారా దుర్గయ్య, గ్రామకార్యదర్శి అంజయ్య, సహకారసంఘం చైర్మన్ మనోహర్, లింగోల చెన్నయ్య, ముత్యం ప్రవీణ్‌కుమార్, గ్యాస్ కృష్ణ, చౌరిగారి ఆంజనేయులు, సంజీవరావు, వివిధశాఖల అధికారులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## గ్రామసభలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు

-అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమపథకాలు అందాలి

-నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి

**కొల్చారం, జనవరి 24, ప్రభాతవార్త:**

ప్రజాపాలన గ్రామసభలు గ్రామాలలో తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమపథకాలు అందాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలకేంద్రమైన కొల్చారం గ్రామంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏడుపాయల్లో రంగంపేట గ్రామానికిచెందిన నీలకంటి ప్రసాద్ కుమారుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మండలం లోని పలువురు లబ్దిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతులమీదుగా లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాంపల్లి గౌరీశంకర్‌గుప్తా, మాజీ ఎంపిపి మంజుల కాశీనాథ్, డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ అరిగి రమేష్‌కుమార్, మాజీ జెడ్పీటిసి పాశం శ్రీనివాస్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సంతోష్‌కుమార్, సిడిసి మాజీ చైర్మన్ సూరెగారి నరేందర్‌రెడ్డి, యూత్ ఐకాన్ రవితేజారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ రంగారెడ్డి, ముత్యం ప్రవీణ్‌కుమార్, చౌరిగారి చిన్నరాములు, లింగోల చెన్నయ్య, వెంకట్రామి రెడ్డి, కొమ్ముల యాదాగౌడ్, గ్యాస్ కృష్ణ, వినోద్ నాయక్, కరెంటు రాజాగౌడ్, మల్లేష్, షాదుల్లా, సాయిబాబా గౌడ్, సోమ నర్సింలు, రవీందర్, సురేష్, మల్లేశం, తలారి దుర్గయ్య పాల్గొన్నారు.

# అభివృద్ధికి కేరాఫ్‌గా మెదక్‌ను తీర్చిదిద్దుతా

146 లక్షల వ్యయంతో జంతుజన్మ కేంద్రం, స్ట్రీట్‌వెండర్ మార్కెట్, మైనార్టీ కమ్యునిటీహాల్‌లను ప్రారంభించిన ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్

50 లక్షల వ్యయంతో సబ్‌సెంటర్, సిసి డ్రైన్, బిసి కమ్యూనిటీహాల్‌ల నిర్మాణాలకు శంఖుస్థాపన



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 24 ప్రభాతవార్త:**

మెదక్ పట్టణంలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపన కార్యక్రమాలను మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ ప్రారంభించారు. మొదటగా 5వ వార్డు లోని దుబ్బతోటలో జంతు జన్మ కేంద్రాన్ని 84 లక్షల రూపాయల వ్యయంతో ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా 21వ వార్డులో పోస్టాఫీసు వెనకాల స్ట్రీట్ వెండర్ మార్కెట్‌ను 42 లక్షల రూపాయల వ్యయంతో ప్రారంభించారు. అనంతరం 14వ వార్డులోని తొల్లబస్తీలో మైనార్టీ కమ్యునిటీ హాల్‌ను 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన దానిని ప్రారంభించారు. అంతే కాకుండా మరో 50 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. 14వ వార్డులోని తొల్లబస్తీలో సబ్ సెంటర్‌కు 20 లక్షల రూపాయల వ్యయంతో శంఖుస్థాపన చేశారు. కాగా 23వ వార్డులోని శివాలయం దేవాలయం ప్రక్కన సీసీ డ్రైన్, బీసీ కమ్యునిటీ హాల్‌కు 15 లక్షల వ్యయంతో పనులకు శంఖుస్థాపన చేశారు. అనంతరం 28వ వార్డు కోలిగడ్డలోని హనుమాన్ దేవాలయం వద్ద సీసీ రోడ్డు, ఆర్‌సీసీ స్లాబ్ పనులకు 15 లక్షల రూపాయల వ్యయంతో శంఖుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచుతానని ఆయన పేర్కొన్నారు. అంతే కాకుండా రాబోయే రోజుల్లో మరింతగా మెదక్‌ను అభివృద్ధి చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ తొడుపునూరి చంద్రపాల్, కౌన్సిలర్‌లు దాయర లింగం, దొంతి లక్ష్మీముత్యం గౌడ్, ఆవారి శేఖర్, లక్ష్మీనారాయణ గౌడ్, రాగి అశోక్, వసంత్ రాజ్, ప్రవీణ్ గౌడ్, మహ్మద్ సమీ, కాంగ్రెస్ పార్టీ నాయకలు బొజ్జ పవన్, ముజాంబిల్, మందుగుల గంగాధర్, ఉమర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడూరి ఆంజనేయులు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హఫీజ్ మొల్సాబ్, దాయర రవి, అమర్, శివరామక్రిష్ణ, సూఫి, పురం వెంకట నారాయణ, భూపతి, తాహేర్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజేయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే డా. రోహిత్..

మెదక్ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు విచ్చేసిన నియోజకవర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ టీయూడబ్ల్యూజేయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

## అధికారులను నిలదీసిన అన్నదాతలు



గ్రామసభలో రుణమాఫీకై అధికారులను నిలదీస్తున్న గ్రామ రైతులు

**ఝరాసంగం, జనవరి 24, ప్రభాతవార్త:**

రెండులక్షల లోపే పంటరుణాలు ఉన్నా రుణమాఫీ కాలేదని అన్నదాతలు, అర్హత ఉన్నా సంక్షేమపథకాలు మంజూరు కాలేదని ప్రజల ఆందోళన, అధికారుల నిలదీతతో గ్రామసభ రసాభాసగా ముగిసింది. శుక్రవారం మండలపరిధిలోని వనంపల్లి, బిడెకన్నె, చిలేపల్లి, చిలేపల్లి తండా, బోర్గావ్, చిలేమామిడి, ఈదుపల్లి గుంత మర్పల్లి, కంబాలపల్లి, కుప్పానగర్, ప్యారవరం గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలను నిర్వహించారు. వనంపల్లి గ్రామసభలో రైతుభరోసాపై సిద్ధాపూర్ క్లస్టర్ ఏఈఓ సుకుమార్ వివరిస్తుండగా తమకు రుణమాఫీ ఎందుకు కాలేదని నిలదీశారు. గ్రామానికిచెందిన అనేకమందికి 2లక్షలలోపే రుణాలు ఉన్నా మాఫీ కాలేదని, అందుకుగల కారణాలను తెలపాలని డిమాండ్‌చేశారు. రుణమాఫికి అర్హులైనవారి జాబితాను గ్రామసభలో ప్రదర్శించాలని అన్నదాతలు డిమాండ్‌చేశారు. 4 విడతల్లో రుణమాఫీ అయినట్లు జాబితాలో పేర్లు ఉన్నా బ్యాంకుల్లో మాత్రం రుణమాఫీ డబ్బులు జమకాలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పంటలసాగుకు రైతుబంధు ఎందుకు ఇవ్వడం లేదని అధికారులను నిలదీశారు. ఆయాగ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో పథకాలు మంజూరు అయిన వారిపేర్లను సభల్లో చదివి వినిపించారు. పలుగ్రామాల్లో అర్హత ఉండి కూడా పథకాలు మంజూరు కాలేదని పలువురు మండిపడ్డారు. ఇండ్ల మంజూరు కొరకు ఫోటోలు దిగినా అర్హత జాబితాలో చేర్చకపోవడం పట్ల పేదలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్హత ఉన్నవారు మరోమారు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు ప్రజలకు సూచించారు.

## దిండియాత్రలో పాల్గొన్న ప్రముఖులు

**నారాయణఖేడ్ టౌన్, జనవరి 24, ప్రభాతవార్త:**

మహారాష్ట్రలోని పండరీపూర్‌కు శుక్రవారం ప్రారంభమైన దిండి పాదయాత్రలో జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్‌శెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. యాత్రలో పాల్గొన్న ఎంపి, ఎమ్మెల్యేలను శాలువాలతో ఘనంగా సన్మానించగా ఎంపి, ఎమ్మెల్యేలు భక్తులతో కలిసి కొంతదూరం పాదయాత్ర నిర్వహించారు. మండలపరిధిలోని హన్మక్రాన(జి) గ్రామంనుంచి శ్రీకరణ్ గజేంద్రభారతి మహారాజ్ ఆధ్వర్యంలో పండరీపూర్‌కు పాదయాత్రగా భక్తులు వెళ్లి దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం భక్తులు పండరీపూర్‌కు భజనలు చేస్తూ పాండురంగడిని స్మరిస్తూ పాదయాత్రగా పయనమయ్యారు.

## జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు

**పెద్దశంకరంపేట, జనవరి 24, ప్రభాతవార్త:**

పెద్దశంకరంపేటలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో జాతీయ బాలికల దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయసిబ్బంది జాతీయ బాలికల దినోత్సవం లోగోను ముగ్గులతో అందంగా అలంకరించారు. కెజిబివి ప్రత్యేక అధికారి విజయమాట్లాడుతూ బాలికలు అన్నిరంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ లో చేరిన బోర్పట్ల నాయకులు

**హత్నూర, జనవరి 24, ప్రభాతవార్త:**

హత్నూర మండలం బోర్పట్ల గ్రామానికిచెందిన పలువురు నాయకులు యువకులు, బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు హత్నూర మండల టిఆర్ఎస్ మీడియా ఇంచార్జ్ వీరేందర్ తెలిపారు.శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి సమక్షంలో వీరు టిఆర్ఎస్‌పార్టీలో చేరారని తెలిపారు.

## హలోమాదిగ చలోసంగారెడ్డి

**హత్నూర, జనవరి 24, ప్రభాతవార్త:**

ఫిబ్రవరి 7న జరగబోయే వేల గొంతులు లక్షడప్పుల మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లాకార్యదర్శి గంధగల ప్రసాద్ మాదిగ కోరారు. ఈకార్యక్రమం విజయవంతం చేయడానికి ఈనెల 26న సంగారెడ్డిలో సన్నాక సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమానికి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ హాజరవుతారని అధికసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈసందర్భంగా డప్పు ర్యాలీప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ నల్లోల్ల మొదలయ్య, మండల అధ్యక్షులు మస్కూరి మల్లేష్‌మాదిగ, చిలప్‌చేడ్ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆశనోల్ల దుర్గాదాస్, చిలిపిశెట్టి ఎల్లయ్యమాదిగ, గ్రామ అధ్యక్షులు ఎర్రోళ్ల రాజు, ఉపాధ్యక్షులు పాల్పనూర్ భాస్కర్‌మాదిగ, మనోహర్‌మాదిగ, బోర్పట్లగ్రామ మాదిగలు పన్యాల మణిక్యంమాదిగ, పెంటేష్‌మాదిగ, అనిల్‌మాదిగ, బీమ్‌మాదిగ పాల్గొన్నారు.

## ఇటుక బట్టీలలో విద్యార్థులకు అవగాహన ర్యాలీ

**గుమ్మడిదల, జనవరి 24, ప్రభాతవార్త:**

గుమ్మడిదలమండలం అన్నారం గ్రామపరిధిలో జాతీయబాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల యువజనసంఘాల సమితి ఆధ్వర్యంలో ఇటుకబట్టీలలో విద్యార్థులకు అవగాహనర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మద్ది ప్రతాప్‌రెడ్డి, యువజనసంఘం నాయకులు వడ్డే ఎల్లయ్య, మంద భాస్కర్‌రెడ్డి, చెన్నంశెట్టి ఉదయ్‌కుమార్, హెచ్‌ఎం రతన్‌కిషోర్, సిఆర్‌పి మురళి, ఐదే ఎట్ అక్షన్ ఆర్గనైజేషన్ వారి విద్యా వాలంటీర్‌లు నాయక్ దుర్యోధన్, జనచైతన్య కళా సమస్త కళాకారులు రొయ్యపల్లి రవి, జీవన్ కుమార్, సంగంసభ్యులు నవీన్‌సాగర్, విష్ణువర్ధన్‌ప్రసాద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన బిజెపిపార్టీ రాష్ట్ర నాయకుడు

**కొల్చారం, జనవరి 24, ప్రభాతవార్త:**

కొల్చారం మండలపరిధిలోని చిన్నఘనపూర్ తాండకుచెందిన పీర్య కుమారుడు పవన్‌సింగ్ కొన్నిరోజుల క్రితం దురదృష్టవశాత్తు లారీ ప్రమాదంలో మృతిచెందాడు. శుక్రవారం బాధిత కుటుంబసభ్యులను బిజెపి పార్టీ రాష్ట్రనాయకుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ పరామర్శించి ఓదార్చడం జరిగింది. పవన్‌సింగ్ మృతిపట్ల ప్రగాఢసానుభూతి తెలిపి, తనవంతుగా ఆర్థికసహాయం అందజేశారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు ఘనపూర్ హరీష్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు పూల్‌సింగ్, సీతారాంతాండ బూత్ అధ్యక్షుడు మలావత్ అంజియా, శివలాల్, బిజెపి సీనియర్ నాయకుడు ఆంజాగౌడ్, బూత్ ప్రధానకార్యదర్శి బైకర్ మల్లేష్, గ్రామయువకులు తదితరులు ఉన్నారు.

## ఎస్టీయూ కాలమానిని ఆవిష్కరించిన మండల విద్యాధికారి యాదగిరి

**వెల్దుర్తి, జనవరి 24, ప్రభాతవార్త:**

స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శుక్రవారం మండల విద్యాధికారి యాదగిరి చేతుల మీదుగా ఎస్టీయూ కాలమానిని ఆవిష్కరించడం జరిగింది. ఎస్టీయూ సంఘం పాఠశాలల బలోపేతం కోసం, విద్యా పరిరక్షణ కోసం, కృషి చేస్తుందని మండల విద్యాధికారి యాదగిరి కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయుల సమక్షంలో కాలమానిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాములు, జహీరుద్దీన్, జిల్లా బాధ్యులు రమేష్‌గౌడ్, చంద్రం, వసంత్, మధుసూదన్, రాష్ట్ర కార్యదర్శి ఎర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోం

**బెజ్జంకి, జనవరి 24, ప్రభాతవార్త :** తప్పుడు ప్రచారాలతో రాష్ట్ర ప్రజలను రెచ్చగొట్టేలా బిఆర్ఎస్ పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏడాది కాలంలో ప్రభుత్వానికి పెరిగిన ఆదరణ చూసి ఓర్వలేక రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను ఆందోళనలకు గురిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ అడ్రస్ లేకుండా పోతుందన్న భయంతో కాంగ్రెస్ సర్కారుపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఎన్ని నెరవేర్చారో తెలపాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ ప్రజా సమస్యలను ప్రభుత్వా దృష్టికి తేవాల్సిందిపోయి ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ తప్పుడు ఆరోపణలు విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు.

సమావేశంలో ఎంసి వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్‌రెడ్డి, ఎంసి డైరెక్టర్ మచ్చ కుమార్, బోనాల మల్లేశం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుమార్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు జాంగిర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కొంకటి రాములు, హరికృష్ణ, రాజు, రాజమహేందర్, మహేందర్‌రెడ్డి, ఐలయ్య, శంకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



దరఖాస్తు స్వీకరిస్తున్న దృశ్యం

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం

**సిద్దిపేట అర్బన్, జనవరి 24, ప్రభాతవార్త :** ప్రజలు ఎవరూ ఆధైర్య పడాల్సిన అవసరంలేదని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మీఅనంద్, వార్డు పార్టీ ఇంచార్జి బొమ్మల అన్నపూర్ణ యాదగిరి అన్నారు. సిద్దిపేటలోని 37వ వార్డులో శుక్రవారం నిర్వహించిన వార్డు సభలో వారు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పథకాలు ప్రవేశపెట్టి ప్రజల సమక్షంలోనే అర్హులను ఎంపిక చేస్తుంటే బిఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, ఫయాజుద్దీన్, అనిల్‌కుమార్, బొమ్మల ప్రవీణ్,, నజ్జు పాల్గొన్నారు.

## రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి : ఎడిఎ

**గజ్వేల్ టౌన్, జనవరి 24 (ప్రభాతవార్త):** గత సంవత్సరం డిసెంబరు 31 వరకు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం వచ్చిన రైతులు, అలాగే రైతు భరోసా, రైతుబంధు పథకానికి దరఖాస్తు పెట్టుకోని రైతులు ప్రస్తుతం రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని గజ్వేల్ డివిజన్ వ్యవసాయ అధికారి బాబునాయక్ సూచించారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ సేవింగ్ ఖాతా ఈకేవైసి అయిన జిరాక్స్, దరఖాస్తు ఫారం నింపి వ్యవసాయ శాఖ కార్యాలయంలో లేదా మీ గ్రామాలకు సంబంధించిన వ్యవసాయ విస్తరణాధికారులకు ఈనెల 26 లోపు అందజేయాలని సూచించారు. రైతు భరోసా పథకం కింద అకౌంట్ నెంబర్ మార్పులు లేదా వేరే కారణాలతో అకౌంట్ నెంబర్లు మార్చాలనుకునే రైతులు కూడా దరఖాస్తు ఫారంపై రాసి ఇవ్వాలని పేర్కొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అంబేద్కర్ ఫొటో పెట్టాలి

**-డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి**


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న డిబిఎఫ్ నాయకులు

**గజ్వేల్ టౌన్, జనవరి 24 (ప్రభాతవార్త):** గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జెండా ఆవిష్కరణ వద్ద బాబా సాహెబ్ అంబేద్కర్ ఫొటో పెట్టాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం 1950 జనవరి 26న భారతదేశం యొక్క రాజ్యాంగాన్ని ఆమోదించడం మరియు దేశం గణతంత్ర దేశంగా మారడాన్ని సూచిస్తుందన్నారు. గల్లీ నుండి ఢిల్లీ వరకు అందరు ఆదర్శంగా గొప్పగా జరుపుకునే జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో గజ్వేల్ డివిజన్ పరిధిలో ప్రతి జెండా ఆవిష్కరణ వద్ద అంబేద్కర్ ఫోటోను తప్పనిసరిగా పెట్టేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, మండల అధ్యక్షుడు ఊశగారి చంద్రం పాల్గొన్నారు.

## ఛలో హైదారాబాద్ కార్మిక భవన్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, జనవరి 24, ప్రభాతవార్త :** భవన నిర్మాణ రంగాల కార్మికుల సమస్యలసాధనే లక్ష్యంగా ఈనెల 31న హైదారాబాద్‌లోని కార్మిక భవన్‌లో నిర్వహించ తలపెట్టిన భవన నిర్మాణ రంగాల కార్మికుల సభను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం పిలుపునిచ్చారు. సిద్దిపేటలో శుక్రవారం ఛలో హైదారాబాద్ కార్మిక భవన్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.రాష్ట్రంలో భవన నిర్మాణ రంగాలలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు.వెల్ఫేర్ బోర్డుకు కార్మికుడినే చైర్మన్‌గా నియమించాలని ప్రభుత్వాని కోరారు. సంక్షేమ పథకాలను బీమా కంపెనీలకు అప్పజెప్పకుండా టెండర్లను రద్దుచేయాలన్నారు. కార్మికులకు శాశ్వతకాలం కార్డులు ఇవ్వలన్నారు.55ఏళ్లు దాటిని ప్రతి కార్మికునికి పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. బోగస్ కార్డులను, ఉపాధి హామీ కార్మికులను పర్మెట్‌గా బోర్డులో నుంచి తొలిగించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తోట్ల పర్శరాములు, రాష్ట్ర నాయకులు దొంతి కేశవులు, జిల్లా అధ్యక్షులు ఆకుల ప్రశాంత్, కార్మికులు కుంబోజి విద్యాకర్, జంగిటి శ్రీను, మల్లేశం, నర్సింలు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**మర్కుక్, జనవరి 24 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన వర్ధన్నగారి వెంకట్‌రెడ్డి(63) మృతి చెందగా విషయం తెలుసుకున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి శుక్రవారం మాజీ సర్పంచ్ భాగ్య బిక్షపతితో కలిసి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతో పాటు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కనకయ్యగౌడ్, నాయకులు యాదగిరి, చిన్నారెడ్డి, నవీన్‌రెడ్డి, బాల్‌నర్సయ్య, రఘుపతిరెడ్డి, రాములు, నర్సింలు, క్రాంతికుమార్‌లు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**హుస్నాబాద్ రూరల్, జనవరి 24, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టారు.అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజల పక్షన పోరాటం చేస్తే తమ పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సభలలో ప్రజలు తమ పేర్లు లేవని ప్రభుత్వాన్ని అధికారులను నిలదీస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు జనవరి 26 నుంచి నాలుగు పథకాలను అమలు చేయాలని లేనియెడల బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అన్వర్, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి : ఎవో

**వర్గల్, జనవరి 24 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వర్గల్ మండల వ్యవసాయాధికారి శేషశయన పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు కొత్తగా పాస్‌బుక్ పొందినట్లయితే వారు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 1వ తేదీ వరకు పట్టాదారు పాస్‌బుక్ పొందిన రైతులు ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, పట్టాదారు పాసుబుక్ జిరాక్సులను దరఖాస్తు ఫారంకు జతపరిచి రైతు వేదికలో వ్యవసాయ విస్తరణాధికారులకు అందజేయాలని సూచించారు.దరఖాస్తుచేసుకోవడానికి ఈనెల 30 చివరితేదీ అని పేర్కొన్నారు.

## రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

**మర్కుక్, జనవరి 24 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని రైతులు 2025 జనవరి 1వ తేదీ నాటికి కొత్తగా పట్టాదారు పాస్‌బుక్కులు వచ్చిన రైతులు రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ సంచాలకులు అనిల్ సూచించారు. శుక్రవారం మర్కుక్‌లో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ఎర్రవల్లి, దామరకుంట, మర్కుక్ రైతు వేదికలలో రైతు భరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాక్ పాస్‌బుక్‌ల జిరాక్సులను రైతు భరోసా దరఖాస్తు ఫారం నింపి జతచేసి ఇవ్వాలని తెలిపారు.

## పేదలకు సంక్షేమ ఫలాలు అందించాలి

**-మున్సిపల్ చైర్మన్ రాజమౌళి**


గ్రామసభలో దరఖాస్తు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

**గజ్వేల్, జనవరి 24 (ప్రభాతవార్త):** పేదలు అందరికీ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 17వవార్డు ముట్రాజ్‌పల్లిలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించేవిధంగా అధికారులు చూడాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలు, 13 హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, స్థానిక కౌన్సిలర్ దుంబాల లక్ష్మి కిషన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, సమీర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు దేవులపల్లి ఆంజనేయులుయాదవ్, ఎండి. జకీర్, ఎస్‌కె.జహంగీర్, కె.శ్రీకాంత్, ఎక్బాల్, న్యాయవాది వినోద్‌చారి పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

**కొమురవెల్లి, జనవరి 24, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఐనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల బృందం ఆర్థిక సహకారంతో శుక్రవారం విద్యార్థులకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఇ.వి.నరసింహారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాధికారి రమేష్, ఎస్‌ఎంసి మాజీ చైర్మన్ నరసింహులు చేతుల మీదుగా క్రీడ దుస్తులు, షూలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఇ.వి. నరసింహారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో దేశానికి సాంకేతక పరంగా చాలా అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల భవిష్యత్ వారి చేతుల్లోనే ఉంటుందని విద్యార్థి దశ నుంచే ఒక స్పష్టత ఉండాలన్నారు. విద్యార్థులకు క్రీడదస్తులు, షూలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేటితో ముగిసిన గ్రామసభలు

**హత్నూర జనవరి 24 ప్రభాతవార్త:** మండలంలో శుక్రవారం జరిగిన గ్రామ సభలో కొన్ని చోట్ల స్థానికులు అధికారులను నిలదీశారు. దౌల్తాబాద్, కొన్యాల, గోవిందరాజుపల్లి, పన్యాల, షేర్ ఖాన్ పల్లి, నాగారం తదితర గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. దౌల్తాబాద్ లో నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. అర్హులకు కాకుండా కొందరు అనర్హులను కూడా జాబితాలో చేర్చారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్ల మంజూరి జాబితాలో అర్హులకు ఎందుకు చోటు కల్పించలేదని వారు నిలదీశారు. అధికారులకు గ్రామస్తులకు మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. జాబితాలో పేర్లు లేని లబ్దిదారులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు వారికి సూచించారు. మండలంలోని షేర్ఖాన్ పల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



నేటి నుంచి జరగనున్న సిపిఐఎం రాష్ట్ర మహాసభలకు ముస్తాబైన సంగారెడ్డి


డిఐఒ శ్రీకళ, ఉపాధ్యారాలు పద్మను సన్మానిస్తున్న దృశ్యం

## అన్నిరంగాల్లోనూ రాణిస్తున్న మహిళలు

**సిద్దిపేట అర్బన్, జనవరి 24, ప్రభాతవార్త :** ప్రపంచంలో ఆడపిల్లలు అన్నిరంగాల్లో పురుషులకు సమానంగా రాణిస్తున్నారని డిఐఒ శ్రీకల అన్నారు. జిల్లాలో భౌతిక రసాయన శాస్త్ర జీవనశాస్త్ర ఉపాధ్యాయులకు, జిల్లా వైద్య సిబ్బందికి పాఠశాల ఆరోగ్యం, శ్రేయస్సు అనే అంశంపై ఈనెల 23,24వ తేదీలో విపంచి ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం సిద్దిపేట జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా డిఐఒ శ్రీకల, ఉపాధ్యాయులు పద్మను ఘనంగా సత్కారించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్ల దేశానికి గర్వకారణమని ఆడపిల్లలపై వివక్ష చూపడం సరికాదన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర బాధ్యులు ములుగు బాలరాజు, మొహమ్మద్ సాదత్ అలీ, జిల్లా బాధ్యులు ప్రవీణ్‌కుమార్, దేవయ్య, బాలకిషన్, ప్రభాకర్, శ్రీహరి, మోహన్, నవీన్, అనిల్‌కుమార్, చక్రధర్, లింగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గెలుపొందిన జట్లకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందజేత


విజేతలకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, జనవరి 24, ప్రభాతవార్త :** సిద్దిపేటలోని స్వర్గీయ ప్రొ॥ జయశంకర్ మినీస్టేడియంలో గడ్డం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న సిఎం రేవంత్‌రెడ్డి క్రికెట్ కప్ టోర్నమెంట్‌లో శుక్రవారం నిర్వహించిన పోటీలలో గెలుపొందిన జట్లకు నిర్వాహకులు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందించారు. ఆరు జట్లు తలపడగా గెలుపొందిన మూడు జట్లకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందించారు. కార్యక్రమంలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చెందిరెడ్డి నరేందర్‌రెడ్డి, బాలరాజు, రాజు, శివకుమార్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

## 3వ వార్డులో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**గజ్వేల్, జనవరి 24 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, వైస్ చైర్మన్ జకియొద్దీన్, స్థానిక కౌన్సిలర్ మర్కంటి వరలక్ష్మి కనకయ్యలు నూతన సిసి రోడ్డు నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ మర్కంటి వరలక్ష్మి కనకయ్య మాట్లాడుతూ 3వ వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని, కోట్ల రూపాయల నిధులు వెచ్చించి సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీ నిర్మాణంతో పాటు వార్డు ప్రజలకు అన్ని వేళల్లో ముందుంటూ సమస్యలను పరిష్కరించామన్నారు. గతంలో ఎవరూ చేయని విధంగా 3వ వార్డుకు కోట్ల రూపాయల అభివృద్ధి జరిగిందన్నారు. ఇందులో భాగంగానే గట్టు కొమురయ్య ఇంటి నుండి పూదరి నర్సింలు ఇంటి వరకు రూ.10 లక్షలతో, చంద లక్ష్మయ్య షాపు నుండి కోదండరాంపల్లి పాఠశాల వరకు రూ.10 లక్షలతో రెండు విడతలుగా మొత్తం రూ.20 లక్షల నిధులతో సిసి రోడ్డు నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొనమైన కన్నాయాదవ్, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ ఎల్ల వెంకటేష్, స్థానిక నేతలు డాక్టర్ ఎల్లేశ్, మామిడి సురేష్‌గౌడ్, కుర్రె కరుణాకర్‌రెడ్డి, కాటు కళ్యాణ్, డాక్టర్ రాజు, కాన్గుల విఠల్, మల్లమైన మహేష్, లింగంయాదవ్, మహిళలు నందాసు ఇందిర, కనకవ్వ, రేణుక, వసంత, కొనమైన రమేష్, గట్టు కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్డు నిర్మాణానికి కొబ్బరికాయ కొడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కౌన్సిలర్ వరలక్ష్మి కనకయ్య

# ఉనికిని కోసమే బిఆర్ఎస్ నేతల విమర్శలు

**ఎంఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్**

**గజ్వేల్, జనవరి 24 (ప్రభాతవార్త):**
పది సంవత్సరాలు బిఆర్ఎస్ అధికారంలో ఉండి ఏనాడైనా గ్రామసభలు నిర్వహించి ఒక్క రేషన్‌కార్డు అయినా ఇచ్చారా అని గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌లు విమర్శించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించి గజ్వేల్ నియోజకవర్గ ప్రజల సమస్యలను పట్టించుకున్నారా అని ఎద్దేవచేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గ్రామాల్లో అధికారుల సమక్షంలోనే లబ్ధిదారులను ఎంపికచేసి లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గానికి చెందిన కొంతమంది బిఆర్ఎస్ నేతలు తమ ఉనికిని కాపాడుకోవడం కోసం మీడియా సమావేశాలు నిర్వహించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కావాలని ప్రజలు కోరుకుంటుంటే ప్రజలకు చేరకుండా బిఆర్ఎస్ నేతలు అడ్డుకుంటున్నారని విమర్శించారు. కోట్ల రూపాయల ప్రజల సొమ్ముతో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని వ్యక్తిగత కార్యక్రమాలకు వినియోగించుకుంటున్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు గజ్వేల్ ప్రజల సమస్యలు పట్టించుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాహిద్, సమీర్, జంగం రమేష్ గౌడ్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, గాడిపల్లి శ్రీను, సుభాష్ చంద్రబోస్, జకీర్, నేత నాగరాజు, గుంటుకు శ్రీనివాస్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.


గ్రామసభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సర్దార్‌ఖాన్, గాడిపల్లి భాస్కర్



ఎర్రవల్లి గ్రామసభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

## అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు : మాజీ ఎమ్మెల్యే

**మర్కుక్, జనవరి 24 (ప్రభాతవార్త):** ప్రజాపాలనలో భాగంగా సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికీ పథకాలు అందుతాయని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ఎర్రవల్లిలో నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అర్హులకు ఏ ఒక్క రేషన్ కార్డు, డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో గ్రామ సభల ద్వారా అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని తెలిపారు. విడతల వారీగా అర్హులు అందరికీ న్యాయం జరుగుతుందని, ఏ ఒక్కరు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తాజా మాజీ సర్పంచ్ భాగ్య బిక్షపతి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కనకయ్యగౌడ్, ఎంపిడిఓ అశోక్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ కుమార్, ఏఈఓ విష్ణు, కార్యదర్శి వికాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తిరుమల్‌రెడ్డి, నాయకులు యాదగిరి, మల్లేశంగౌడ్, రాములు, బాల్‌నర్సయ్య, బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న ఎంవిఐ క్రిస్టోఫర్

**గజ్వేల్, జనవరి 24 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల సెయింట్‌మేరీస్ పాఠశాలలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం రోడ్డు ప్రమాదాల నివారణపై గజ్వేల్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ క్రిస్టోఫర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గజ్వేల్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కిస్టోఫర్ మాట్లాడుతూ రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపినట్లయితే ప్రమాదాలు జరగవని తెలిపారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ వాహన పత్రాలతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు తెలుసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండే వరకు వాహనాలు నడుపవద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఇన్నారెడ్డి, ఏఎంవీఐ శ్రీకాంత్‌రెడ్డి, రవాణ శాఖ కానిస్టేబుల్ జయలక్ష్మి, నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు

**-టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి**

**గజ్వేల్ టౌన్, జనవరి 24 ప్రభాతవార్త :** పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి పేర్కొన్నారు. రేషన్‌కార్డు ఇవ్వని బిఆర్ఎస్ నాయకులు అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం శోచనీయమని, రేషన్‌కార్డులపై బిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని నిందించడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. శుక్రవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇలాంటి చౌకబారు విమర్శలుచేస్తున్న బిఆర్ఎస్ నాయకుల మాటలను ప్రజలు ఎవరూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న నాలుగు పథకాలను పార్టీల కతీతంగా అర్హులందరికీ వర్తింపచేస్తామని, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల విషయంలో ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధిని సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు.మరో నాలుగు పథకా లను ప్రభుత్వం అర్హులకు అందజేసి విజయవంతం గా అమలు చేస్తుందని స్పష్టంచేశారు. కాంగ్రెస్ పార్టీ పై, రేవంత్‌రెడ్డిపై బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలను ఎవరూ పట్టించుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

## అర్హులకు అందని ప్రభుత్వ పథకాలు

**మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంగోలు చంటి**

**చేర్యాల, జనవరి 24, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం అందిచబోయే పథకాలు అర్హులకు అందడంలేదని చేర్యాల మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంగోలు చంటి ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ చేర్యాల మున్సిపల్ పరిధిలో అనేక మంది పేదలు వివిధ పథకాలకు దరఖాస్తు చేసుకుంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి కుటుంబ సభ్యుల పేర్లతోపాటు వారికి అనుగుణంగా ఉన్న వారిని ఎంపిక చేశారని తెలిపారు. దీంతో అసలైన అర్హులకు పథకాలు అందడంలేదన్నారు. ప్రతి ఒక్కరికి పథకాలు అందుతాయని ప్రభుత్వం గొప్పలు చెప్పడం కాదని అర్హులను గుర్తించి పథకాలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

## కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే ఇందిరమ్మ ఇళ్లు

**కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొల్లపెల్లి వీరాచారి**

**అక్కన్నపేట, జనవరి 24, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతున్నాయని కాని కాంగ్రెస్ పార్టీ తామే స్వయంగా ఇస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటుందని కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొల్లపెల్లి వీరాచారి తెలిపారు. శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడుతూ అన్ని అర్హతలు కలిగిఉన్న పేదలకు ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలో చాలా మండలాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికే పథకాలు ఎంపిక చేస్తున్నారని చెప్పారు. మరికొన్ని చోట్ల పథకాలు పెట్టిస్తామని డబ్బులు వసూలు చేస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వాటిని బిజెపి సహిచందని ఎల్లప్పుడు ప్రజలకు పార్టీ అండగా ఉంటుందన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

**గజ్వేల్ టౌన్, జనవరి 24 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామానికి చెందిన పురం ఆంజనేయులుకు రూ.22వేలు, గొడుగు పద్మకు రూ.19,500, మల్లం మంగమ్మకు రూ.9వేల చెక్కులు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను శుక్రవారం మాజీ ఎంపిటిసి జ్యోతి స్వామి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గొల్ల స్వామి, నాయకులు పురం ఆంజనేయులు, ప్రభాకర్, అనిల్, సత్తయ్య, కిష్టయ్య, రఘుపతి, రామచంద్రం, నవీన్, నర్సింలు, రాజు, ఆంజనేయులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా కాంగ్రెస్ సర్కారు

**యూత్ కాంగ్రెస్ నేత పూజల గోపికృష్ణ**

**సిద్దిపేట అర్బన్, జనవరి 24, ప్రభాతవార్త :** పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పూజల గోపికృష్ణ అన్నారు. సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన 29వ వార్డుకు చెందిన పురుషోత్తంకు సిఎం సహాన నిధి మంజూరైన రూ.60 వేల చెక్కును అందజేసి మాట్లాడారు. సిఎం సహాయ నిధి పేదలకు వరంలాంటిదన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి నిరుపేదకు కార్పొరేట్ స్థాయిలో వైద్య చికిత్సలు చేయించుకోవడానికి సిఎం సహాయ నిధి అందించడం జరుగుతుందన్నారు. నిరుపేదలు కార్పొరేట్ స్థాయి అసుపత్రిలో చికిత్సలు చేయించుకోవడానికి సిఎం సహాయ నిధితో పాటు ఎల్‌ఓసి జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ, నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ చొరవతో అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సదశివారెడ్డి, రషద్, ఎర్రబోలు రాజిరెడ్డి, కరుణాకర్, జనార్ధన్‌రెడ్డి, సాయిప్రతాప్, మంద వనజ, సంతోషి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహాకుంభమేళాకు భక్తులు

**ఝరాసంగం, జనవరి 24, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన ఝరాసంగం నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌లోని త్రివేణిసంగమం ప్రయాగ్‌రాజ్ వద్ద కొనసాగుతున్న మహాకుంభమేళాకు శుక్రవారం భక్తులు పయనమయ్యారు. శ్రీశ్రీశ్రీ 108 వీరేశ్వరాశివాచార్య మహాస్వామి ఆధ్వర్యంలో ధనశ్రీ హిరేమఠ్, శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు బసయ్యస్వామిలు ఝరాసంగంలోని శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించి కుంభమేళాకు బయలుదేరారు. కార్యక్రమలో ఏపిఓ రాజ్‌కుమార్‌స్వామి, భక్తులు తదిలరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో పత్యానాయక్‌తండాలో బోరు



పత్యనాయక్ తండాలో బోరును డ్రిల్ చేస్తున్న దృశ్యం

**సిర్గాపూర్, జనవరి 24, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని అంతర్గాం పంచాయితీ హాబిటేషన్ గ్రామమైన పత్యనాయక్ తండాలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సహకారంతో బోరును డ్రిల్‌చేయించారు. కార్యక్రమంలో అంతర్గామ మాజీసర్పంచ్ రవీందర్‌పాటిల్, తండాపెద్దలు, పంచాయితీకార్యదర్శి తదితరులు పాల్గొన్నారు. బోరును డ్రిల్‌చేయించిన ఎమ్మెల్యేకు తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

## అర్హులందకీ సంక్షేమ పథకాలు



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపి సురేష్‌కుమార్‌శెట్కార్ (చిత్రంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి)

**నాగల్‌గిద్ద, జనవరి 24, ప్రభాతవార్త:**
అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్‌శెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డిలు అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని కరస్‌గుత్తి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఈ సందర్భంగా రైతుబీమా లబ్దిదారులకు చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపిడిఓ, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మాణిక్‌రావుపాటిల్, మాజీ ఎంపిపి అధ్యక్షులు శంకరయ్యస్వామి, నాయకులు గుండేరావుపాటిల్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్, సచిన్‌పాటిల్, వినోద్‌పాటిల్, రమేష్‌చౌహాన్, అశోక్‌రెడ్డి, పండరినాథ్, నారాయణజాదవ్, విఠల్‌రెడ్డి, సోపన్‌రావు, అంబ్రెష్, రూప్‌సింగ్, అశోక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన గ్రామసభలు



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ మన్నె కిరన్‌కుమార్

**చౌటకూరు, జనవరి 24, ప్రభాతవార్త:**
సంక్షేమపథకాల అమలుకై నిర్వహిస్తున్న గ్రామసభలు శుక్రవారంతో ముగిసాయి. ఈనెల 26వ తారీఖు నుంచి అమలుచేయనున్న ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, రేషన్‌కార్డులు, ఆత్మీయభరోసా పథకాలకొరకు ప్రజల నుంచి గ్రామసభల్లో దరఖాస్తులు స్వీకరించారు. మండలకేంద్రమైన చౌటకూరులో 292 దరఖాస్తులు రాగా రేషన్‌కార్డుల్లో పేర్లు చేర్చేందుకు 134, కొత్త కార్డులకు 130, ఇందిరమ్మ ఇళ్లకొరకు 25 ఆత్మీయభరోసాకు 3 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్, ఎంపిడిఓ ఆనందమేరీ, ఎంపిఓ శ్రీకాంత్, పంచాయతీరాజ్ ఏఈ శశికుమార్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్, ఏఓ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి సందీప్‌గౌడ్, వర్కల రమేష్, కలాలి రామాగౌడ్, కైసర్, ఈశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

## అర్హులైనవాందరికీ సంక్షేమ పథకాలు

**-మండల కాంగ్రెస్ అధ్యక్షులు దశరథ్**

**చౌటకూరు, జనవరి 24, ప్రభాతవార్త:**
మండలంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమపథకాలు మంజూరు అవుతాయని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్ అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని శివంపేటలో ప్రజాపాలన గ్రామసభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నత్తి దశరత్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామసభలో సంక్షేమపథకాలు మంజూరు అయిన వారి వివరాలు ప్రకటించారని, అర్హత ఉండి, పథకాలు మంజూరు కాకుంటే మరోమారు దరఖాస్తుచేసుకోవాలని మండలప్రజలకు దశరథ్ సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి, రెవిన్యూ, వ్యవసాయాధికారులు, పంచాయతీకార్యదర్శి, మండల కాంగ్రెస్‌నాయకులు ఈశ్వర్‌గౌడ్, రామస్వామి, శివంపేట మాజీసర్పంచ్ రాజ్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు కిరణ్‌గౌడ్, మండల సిడిఆర్ అధ్యక్షులు సంగు భరత్‌కుమార్, మల్లికార్జున్‌గౌడ్, జావిద్‌నజీబ్, విశ్వకర్మ మండలాధ్యక్షులు కమ్మరి అశోక్ పాల్గొన్నారు.

## చిన్నారులను పరామర్శించిన ఎమ్మెల్యే



చిన్నారులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్ టౌన్, జనవరి 24, ప్రభాతవార్త:**
అంగన్‌వాడి భవనం పైకప్పు పెచ్చులూడి చిన్నారులపై పడిన సంఘటనలో గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్న చిన్నారులను ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పరామర్శించారు. మండలపరిధిలోని వెంకటాపూర్‌గ్రామంలోని అంగన్‌వాడికేంద్రంలో చిన్నారులు ఉండగా పైకప్పు పెచ్చులూడి కిందపడ్డ సంఘటనలో 5గురు విద్యార్థులు గాయాలకు గురయి ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు నాణ్యమైన చికిత్సలు అందచేయాలని డాక్టర్లకు సూచించారు. అంగన్‌వాడి భవనానికి తగురీతిలో మరమ్మత్తులు చేయకపోవడంతో ప్రమాదం చోటు చేసుకుందని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదానికి గురైన చిన్నారులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి హామీ చేశారు.

# మంచినీటి పథకానికి శంకుస్థాపన

**-పూజలు నిర్వహించిన ఎంపి, ఎమ్మెల్యే, చైర్మన్**



మంచినీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపి, ఎమ్మెల్యేలు

**నారాయణఖేడ్ టౌన్, జనవరి 24, ప్రభాతవార్త:**
పట్టణంలో జర్నలిస్టు కాలనీలో అమృత్ 2.0 పథకంలో మంచినీటి సరఫరా పథకానికి శుక్రవారం జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్‌లు శంకుస్థాపన చేశారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి పథకం ఏర్పాటుకు ఎంపి, ఎమ్మెల్యేలు మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ శెట్వార్‌తో కలిసి శ్రీకారం చుట్టారు. 13కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్వహించే పథకం ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం పట్ల పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం మిషన భగీరథ పేరుతో వేల కోట్ల రూపాయలను కమిషన్లను దండుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ నిర్లక్ష్యం మూలంగా గ్రామాల్లో, తండాల్లో ప్రజలు తాగునీటికి తహతహలాడారిని గుర్తు చేశారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తగు చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్, వైస్ చైర్మన్ దారం వంకర్‌సేట్, వివేకానంద, రాజేష్, తాహేర్, వినోద్ పాటిల్, రమేష్ చౌహాన్, పండరిరెడ్డి, ముంతాజ్ సేట్, మోహినోద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## మహాపాద యాత్రలో పాల్గొన్న చైర్మన్

**నారాయణఖేడ్ టౌన్, జనవరి 24, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ పట్టణంలోని రామాలయం నుంచి మహారాష్ట్రలోని పండరిపూర్‌కు కరన్‌గజేంద్రభారతి మహారాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం మహాపాదయాత్ర ప్రారంభం అయింది. రామాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మహాపాదయాత్రకు శ్రీకారం చుట్టారు. పాదయాత్రలో జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుజ్జుపు మచ్చేందర్ పాల్గొని భక్తులతో కలిసి కొంతదూరం కాలినడకన ప్రయాణం చేశారు.

## పాపన్నపేట జడ్పీహెచ్‌ఎస్‌లో మాక్ పోలింగ్



జడ్పీహెచ్‌ఎస్‌లో మాక్ పోలింగ్‌కు సిద్ధంగా ఉన్న విద్యార్థులు

**పాపన్నపేట, జనవరి 24, ప్రభాతవార్త:**
జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు విశ్వనాథ్ రజిత, లక్ష్మిల ఆధ్వర్యంలో మండల కేంద్రమైన పాపన్నపేటలో జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ఓటింగ్‌లో పాల్గొనేతీరు, ఓటు వేసేవిధానంపై అవగాహన కల్పించారు. 480మంది విద్యార్థులు ఓటర్ స్లిప్పులతో ఓటు వేసేందుకు బారులుతీరి తమ ఓటును సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశం, నాగరాజు, అంజాగౌడ్, ప్రవీణ్‌కుమార్, యాదయ్య, రియాజ్, అనిల్, నింగప్ప, కృష్ణకాంత్, మోహన్‌రావు, వేణుగోపాల్‌రెడ్డి, శ్రవణ్, రవికాంత్, జకేరా, పద్మ, కవిత, శభ తదితరులు పాల్గొన్నారు.

## న్యాల్‌కల్ గ్రామసభలో ప్రత్యేక అధికారి



న్యాల్‌కల్ గ్రామసభలో పాల్గొన్న ప్రజలు, అధికారులు

**న్యాల్‌కల్, జనవరి 24, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో శుక్రవారం ప్రజాపాలన గ్రామసభను నిర్వహించారు. ప్రజాపాలన గ్రామసభకు మండల ప్రత్యేక అధికారి రవీందర్ హాజరై సంక్షేమపథకాలు అందుకోబోయే లబ్దిదారుల పేర్లను వినిపించారు. సంక్షేమపథకానికి తాము అర్హులమని, అయినా తమపేర్లు రాలేదని పలువురు అధికారుల దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఓ కవలాస్ రాజశేఖర్, ఇంచార్జి పంచాయతీకార్యదర్శి ధన్‌రాజ్, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. మండలంలోని అత్నూర్‌గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఎంపిఓ సురేష్ పాల్గొనగా బసంత్‌పూర్‌లో తహసీల్దార్ భూపాల్, ఎంఈఓ మారుతి రాథోడ్, ఏఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయలకు పులిహోర ప్యాకింగ్ యంత్రం

**పాపన్నపేట, జనవరి 24, ప్రభాతవార్త:**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గాభవానీమాత ఆలయానికి కూకట్‌పల్లికిచెందిన భక్తులు పులిహోర ప్యాకింగ్‌చేసే యంత్రాన్ని బహుకరించారు. శుక్రవారం కూకట్‌పల్లికిచెందిన సుష్మ, శ్రీకాంత్ దంతపులు, వారి కుమారుడు అయాన్‌సాయి, తల్లిదండ్రులు వీరభద్రయ్య, రేణుకలు ఆలయానికి చేరుకుని ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకర్‌శర్మ ప్రత్యేకపూజలు నిర్వహించి ఆలయానికి యంత్రాన్ని అందచేశారు. ఆలయ అర్చకులు దాతలకు ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందచేశారు.

## రోడ్డు నిబంధనలు పాటిద్దాం-ప్రమాదాలు నివారిద్దాం

**-ఎంవిఐ వెంకటయ్య**



రోడ్డు భద్రత వారోత్సవాల సభలో మాట్లాడుతున్న ఎంవిఐ వెంకటయ్య

**జహీరాబాద్, జనవరి 24, ప్రభాతవార్త:**
రోడ్డునిబంధనలు పాటిస్తూ వాహనాలుతోలితే రోడ్డుప్రమాదాలను నివారించవచ్చని జహీరాబాద్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ వెంకటయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసి డిపో ఆవరణలో నిర్వహించిన రోడ్డుభద్రత వారోత్సవాలను పురస్కరించుకుని డ్రైవర్స్‌డేగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఎంవిఐ వెంకటయ్య మాట్లాడుతూ వాహన చోదకులు ఏకాగ్రతతో వేగాన్ని నియంత్రించుకుని వాహనాలు తోలాలని సూచించారు. రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారమే ఉండదన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ఎం.కాశీనాథ్, అసిస్టెంట్ డిపో మేనేజర్ ప్రవీణ్‌కుమార్, గ్యారేజ్ మేనేజర్ తిరుమలేష్, ఆర్టీసి సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన శంభు దేవుని జాతర



దేవాలయంలో గణపతి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

**కొండపాక, జనవరి 24, ప్రభాతవార్త**
కాకతీయుల కాలంనాటి పురాతన చరిత్ర కలిగిన దుద్దెడ శ్రీ స్వయంభూ శంభులింగేశ్వరస్వామి దేవాలయం వార్షిక బ్రహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులు పాటు జరిగే ఈ ఉత్సవాలు కన్నుల పండగలా జరిగింది, ఉత్సవాలకు త్రిటౌన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రాజీవ్ రాహదరిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా టోల్‌గేట్ సిబ్బంది సహకరించారు. కార్యక్రమంలో దేవాలయం ట్రస్ట్ చైర్మన్ మంచాల శ్రీనివాస్, సభ్యులు పెద్దంకుల శ్రీనివాస్, పెద్ది కుమార్, నూనె కుమార్, గోనే శ్రీనివాస్, వద్దకొండ శ్రీనివాస్, నర్ర దేశాయిరెడ్డి, మంచాల చిన్న శ్రీనివాస్, పెద్ది నర్సయ్య, పబ్బోజు రాజయ్య, మాజీసర్పంచ్ అరెపల్లి మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## పుస్తె మెట్టెలు అందజేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

**కొల్చారం, జనవరి 24, ప్రభాతవార్త:**
పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరారెడ్డి తనవంతు సహాయం చేస్తున్నారు. శుక్రవారం కొల్చారం మండలపరిధిలోని చిన్నఘనపూర్‌గ్రామంలో తుడుం అనసూయ, సంజీవులు దంపతుల కుమార్తె స్వర్ణలత వివాహానికి తనవంతుగా పుస్తెమెట్టెలను బహుకరించారు. కార్యక్రమంలో బిజెపి మండలపార్టీ అధ్యక్షుడు ఘనపూర్ హరీష్, కిసాన్ మోర్చా అధ్యక్షులు పల్లె రవికాంత్, ఘనపూర్ బూత్ అధ్యక్షులు మంద మహేష్, నాయకోటి గోవర్ధన్, బిజెపి సీనియర్ నాయకులు అంజాగౌడ్, మధుసుదన్ గౌడ్, బాబాగౌడ్, బూత్ ప్రధానకార్యదర్శి మల్లేష్, రంజిత్ పాల్గొన్నారు.

# హెల్మెట్, సీటు బెల్టు ధరించి ప్రాణాలను కాపాడుకోవాలి

**-ఎంవిఐ శంకర్‌నారాయణ**



వాహనదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

**కొండపాక, జనవరి 24, ప్రభాతవార్త**
రోడ్డుప్రమాదాల బారినపడకుండా వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని సిద్దిపేట జిల్లా అర్‌టిఓ కార్యాలయం ఎంవిఐ శంకర్‌నారాయణ అన్నారు. శుక్రవారం రాజీవ్ రహదారిపై దుద్దెడ శివారులోని టోల్ గేట్ వద్ద హెచ్‌కెఅర్, ట్రాఫిక్ పోలీసులు, వైద్య సిబ్బంది, అర్‌టిఓ సంయుక్త ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనలపై వాహనదారులకు అవగాహన కార్యక్రమంనిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ సెల్ ఫోన్‌కు రక్షణగా స్క్రీన్ గార్డ్‌లను వాడుతున్నారు. కాని ప్రాణాలను రక్షించే హెల్మెటు మాత్రం వాహనదారులు పెట్టుకోవడం లేదని అన్నారు. గతసంవత్సరం హెల్మెట్ పెట్టుకోకపోవడంవల్ల రోడ్డుప్రమాదాలుజరిగి 30వేలమంది ద్విచక్ర వాహనదారులు మరణించారని విచారం వ్యక్తంచేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకొన్న తర్వాత, కారు డ్రైవ్‌చేసే వారు సీటు బెల్టు పెట్టుకున్న తర్వాతనే బండి స్టార్ట్ చేయాలని అయన సూచించారు. రోడ్డుపైన ప్రమాదాలు జరిగినప్పుడు గాయపడ్డ వారిన కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని కోరారు. రాంగ్ డ్రైవింగ్ చేయడం ఒకరిని హత్య చేసినదానితో సమానమన్నారు. వాహనదారులు ఎప్పుడూ ఆర్‌సి, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కాగితాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. కొండపాక పిహెచ్‌సి డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినపుడు గోల్డెన్‌అవర్ ఎన్నోప్రాణాలను కాపాడడానికి ఉపయోగపడుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయాపడ్డ వారిని అసుపత్రులకు తరలించాలని చికిత్స సరైన సమయంలో అందేలా చూడాలని కోరారు. డిటిఓ కొండల్‌రావు, ట్రాఫిక్ సిఐ ప్రవీణ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. అనంతరం కొండపాక డాక్టర్ శ్రీధర్ అధ్వర్యంలో ఉచిత ఆరోగ్యవైద్యశిబిరం నిర్వహించి వైద్య పరీక్షలుచేసి మందులు పంపిణీచేశారు. కార్యక్రమంలో హెకెఅర్ మేనేజర్ అశోక్‌రెడ్డి, ఎంవిఐలు నేహ, శ్రీకాంత్, ట్రాఫిక్ పోలీసులు విజయ్‌కుమార్, జగదీశ్వర్, తిరుపతి, శకీర్, రవీందర్, టోల్ గేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కందిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్

**కంది, జనవరి 24, ప్రభాతవార్త:**
హైద్రాబాద్ బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ ఉమెన్ కళాశాల ద్వారా గ్రేస్ ఫౌండేషన్ సహకారంతో శుక్రవారం మండలకేంద్రమైన కందిలోని రైతువేదికలో ఉచిత క్యాన్సర్‌స్క్రీనింగ్ క్యాంప్‌ను నిర్వహించారు. మహిళల ఆరోగ్యాన్ని పెంపొందించే ప్రయత్నంలో ఉన్నత్ భారత్ అభియాన్ (యుబిఏ)జట్టు కృషిచేస్తోందని, ఇందులో భాగంగానే కందిలో క్యాంప్‌ను నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. శిబిరానికి చేరుకున్న 150 మందికి పరీక్షలు నిర్వహించినట్లు క్యాంప్ కో-ఆర్డినేటర్ రూపాలి పేర్కొన్నారు.

## రైతుభరోసా ఇంకెప్పుడిస్తారు



వాసర్ గ్రామసభలో రైతుభరోసాపై ప్రశ్నిస్తున్న రైతులు

**సిర్గాపూర్, జనవరి 24, ప్రభాతవార్త:**
వ్యవసాయ పెట్టుబడికొరకు రైతులకు అందించే రైతుభరోసా ఇంకెప్పుడిస్తారని రైతులు అధికారులను ప్రశ్నించారు. మండలపరిధిలోని వాసర్, సిర్గాపూర్, కడపల్, గౌడ్‌గామ్, గైరాన్‌తండాలలో శుక్రవారం ప్రజాపాలన గ్రామసభలను నిర్వహించారు. వాసర్‌గ్రామంలో ప్రత్యేక అధికారి, తహసీల్దార్ ఉమాశంకర్ ఆధ్వర్యంలో ప్రజాపాలన గ్రామసభను నిర్వహించారు. మూడువిడతల్లో రైతుబంధు ఇచ్చారని, నాలుగో విడతలో రైతులఖాతాల్లో జమవుతాయని ఏఈఓ శ్వేత తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మచ్చేందర్, పంచాయతీ కార్యదర్శి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులు చేసుకుంటే అర్హుల ఎంపిక



దరఖాస్తు స్వీకరిస్తున్న వార్డు కౌన్సిలర్ రంగ సురేష్‌గుప్త

**జోగిపేట, జనవరి 24, ప్రభాతవార్త:**
అర్హులైనవారందరికీ కొత్తగా అమలుచేయబోయే పథకాలు అందచేస్తామని అందోలు-జోగిపేట మున్సిపాలిటీపరిధిలోని 13వవార్డు కౌన్సిలర్ రంగసురేష్ అన్నారు. ప్రజాపాలన సభల్లో భాగంగా శుక్రవారం వార్డులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాబితాలో లేనివారికి కూడా అవకాశం కల్పించాలనే ఉద్దేశంతోనే గ్రామసభలు, వార్డుసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇంకా జాబితాలో రానివారు తమదరఖాస్తులను అందచేయాలని సూచించారు. కాగా తమవార్డులో ఎక్కువగా రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన దరఖాస్తులే ఎక్కువగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, మున్సిపల్ ఛైర్మెన్ గూడెం మల్లయ్య, కౌన్సిలర్లు సురెందర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు పట్లోల్ల ప్రవీణ్‌కుమార్, గొల్ల శరత్‌బాబు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌వి అబద్ధపు ప్రచారాలు

**-అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరన్**

**జోగిపేట,జనవరి 24,ప్రభాతవార్త:**
రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ నాయకులు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని అందోలు మాజీ శాసనసభ్యులు క్రాంతికిరణ్ విమర్శించారు. శుక్రవారంనాడు అందోలులోని ఓ ఫంక్షన్‌హాలులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ నాయకులు కేటిఆర్, హరీష్‌రావుకు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ రైతులను మభ్యపెడుతుందని చెబుతూనే ఉన్నారని తెలిపారు. అయినా రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ అడ్డగోలు అబద్దాలు చెబుతుందని, మంత్రి దామోదర్ రాజనర్సింహనే ఇంకా కొంతమంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందని పేర్కొనటంతో ఈ విషయం తేటతెల్లమౌతుందని ఆయన విమర్శించారు. అంతేకాకుండా ప్రజాపాలన గ్రామసభల పేరిట ప్రజలను మోసం చేస్తున్నారని, కేవలం తమ పార్టీకి చెందిన వారినే పథకాలకు ఎంపిక చేస్తున్నారని, గ్రామసభల నిర్వహణలో కూడా ప్రోటోకాల్ పాటించటంలేదని విమర్శించారు. ఈ సమావేశంలో డిసిసిబి మాజీ ఉపాధ్యక్షులు పి.జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపిపి హెచ్.రామాగౌడ్, మాజీ ఏఎంసి ఛైర్మెన్ డి.బి.నాగభూషణం, అందోలు,మునిపల్లి మండల పార్టీల అధ్యక్షులు లక్ష్మీకాంత్‌రెడ్డి, విజయ్‌కుమార్,చాపల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరం మైనర్ల డ్రైవింగ్

**-కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్**





అటోడ్రైవర్లకు రోడ్డు నిబంధనలను వివరిస్తున్న దృశ్యం

**కొండపాక, జనవరి 24, ప్రభాతవార్త**
జాతీయరోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం కుకునూరుపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జ్‌పై ఎఎస్ఐ సువర్ణ, తమసిబ్బందితో కలిసి అటోడ్రైవర్లకు, యువకులకు, గ్రామప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనల గురించి వివరించారు. మద్యంసేవించి వాహనాలు నడపరాదని, కార్లునడపేటప్పుడు తప్పనిసరిగా సీటుబెల్టు పెట్టుకోవాలని, ద్విచక్రవాహనంపై వెళ్లే ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, అతివేగంగా వాహనాలను నడపరాదని, రాంగ్, సైడ్‌డ్రైవింగ్ చేయవద్దన్నారు. త్రిబుల్ రైడింగ్ చేయరాదని, మైనర్ల(చిన్నపిల్లల) డ్రైవింగ్ ప్రమాదకరమన్నారు. వాహనాలు నడిపేటప్పుడు వాహనాలకు సంబంధించిన పత్రాలు డ్రైవింగ్‌లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలను కలిగి ఉండాలని సూచించారు.

## సహకారబ్యాంకుల్లో అధికవడ్డీ

**పాపన్నపేట, జనవరి 24, ప్రభాతవార్త:**
సహకారబ్యాంకులలో డిపాజిట్‌లపై అత్యధిక వడ్డీరేటు లభిస్తుందని పాపన్నపేట డిసిసిబి బ్యాంక్ మేనేజర్ కిషన్ తెలిపారు. శుక్రవారం బ్యాంక్ ఆవరణలో నిర్వహించిన డిపాజిట్‌ల సేకరణ వారోత్సవాలను పురస్కరించుకుని బ్యాంక్ ఆవరణలో కార్యక్రమం నిర్వహించారు.
మేనేజర్ కిషన్ మాట్లాడుతూ డిపాజిట్ చేసిన మొత్తం 8,9 సంవత్సరాల్లో రెట్టింపు అవతుందన్నారు. సీనియర్‌సిటిజన్‌లకు డిపాజిట్‌లపై అధ్యధికంగా 8.40వడ్డీ చెల్లిస్తామన్నారు. డిపాజిట్‌లపై 5లక్షల రూపాయల వరకు ఇన్సూరెన్స్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి ప్రేమ్‌సింగ్, అసిస్టెంట్ మేనేజర్ రాజు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.